కార్యాలయాల్లో.. సోలార్ కాంతులు



- నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలరైజేషన్
- నిర్వహణకు ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- ఏడాదికి లక్ష యూనిట్లు వచ్చే కార్యాలయాలకు ప్రాధాన్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 కార్యాలయాల్లో ప్యానల్స్ ఏర్పాటు
- ఏడాదికి సుమారు రూ.50 కోట్లకుపైగా తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం
- సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందంటున్న అధికారులు

సోలార్ పవర్.. సూర్యుడి వెలుగులను వృథా కానీయకుండా కరెంట్ ఉత్పత్తి. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులపై బిల్లుల భారం తగ్గుతుంది. ఈ క్రమంలో సోలార్ పవర్ ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు కూడా సోలార్ పవర్‌ను సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతను ఎన్‌టీపీసీకి అప్పగించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 260 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి సోలార్ కాంతులు ప్రసరించనున్నాయి. తద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనున్నది.

- (గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి గతంలో నెలకు రూ.30 లక్షల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు అది రూ.3 లక్షలకు పరిమితమైంది. కారణం ఏమిటంటే అక్కడ 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ అమర్చారు.
- గుంటూరు నగరానికి తాగునీటిని అందించే సంగం జాగర్లమూడి పంపు హౌస్ వద్ద 500 కిలో వాట్ సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ అమర్చారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లు తగింది.
- గుంటూరు కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రధాన కార్యాలయాలకు గతంలో రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. ఆయా కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

పలు ప్రభుత్వ కార్యాలయాలకు నెలనెలా రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. వాటిని కట్టడం ఆయా కార్యాలయాలకు గగనంగా మారుతుంది. ఇప్పటికీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ట్రాన్స్‌కోకు ఉన్న పెండింగ్ బిల్లుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల వాటానే అధికం. కొన్ని సందర్భాల్లో కరెంటు బిల్లులు కట్టలేదని ట్రాన్స్‌కో అధికారులు ఆయా కార్యాలయాలకు విద్యుత్ ఫీజులు తీసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంపై దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఆంధ్రప్రదేశ్ నూతన మరియు పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి సొమ్మును ఆదా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భవనాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వినియోగిస్తుంది. ఆయా కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు తగ్గిపోయాయి.

ఎన్‌టీపీసీదే మొత్తం బాధ్యత

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త బిజిలీ యోజన కింద ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుడుతున్నది. ఈ క్రమంలో ఈ బాధ్యతను ప్రభుత్వం ఎన్‌టీపీసీకి అప్పగించింది. రెస్కో సిస్టంలో ఎన్‌టీపీసీ ఈ బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యత 25 ఏళ్ల వరకు ఎన్‌టీపీసీ చూసుకుంటుంది. ప్యానల్స్ ఏర్పాటు మొత్తం ఖర్చును ఎన్‌టీపీసీ భరిస్తుంది. అందుకు ప్రతిగా ప్రభుత్వ శాఖల నుంచి అతితక్కువ విద్యుత్ చార్జీలను వసూలు చేస్తుంది. ఉదాహరణకు ప్రస్తుతం యూనిట్ చార్జి రూ.4 వరకు ఉంటే, సోలరైజేషన్ తర్వాత ఎన్‌టీపీసీ యూనిట్ చార్జి రూ.2 మాత్రమే తీసుకునేలా ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. సోలరైజేషన్‌కు మొదట ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్లు నెడ్ క్యాప్ తేల్చింది. గుంటూరు సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఒక్కొక్క కార్యాలయం, స్థానిక సంస్థలకు నెలనెలా లక్షల్లో కరెంట్ బిల్లు వస్తుంది. సోలరైజేషన్ జరిగితే ఆ భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం గుంటూరుకు తాగునీరు అందించే సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్(నీటిపై) ప్యానల్స్ ఏర్పాటు చేశారు. దానివల్ల ఆ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం బాగా తగ్గినట్లు తేలింది. సోలార్ పని తీరును తెలియజేసే యాప్‌లో 2023 డిసెంబరులో సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పటి వరకు 169.8 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి తగ్గిందని, 169.8 టన్నుల బొగ్గు ఆదా అయినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బొగ్గు నిల్వలు పెరుగుతాయని, ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందంటున్నారు.

అద్భుతమైన పరిష్కారం



విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సోలార్ విద్యుత్ అద్భుతమైన పరిష్కారం. సోలరైజేషన్ వల్ల ప్రభుత్వ సొమ్ము చాలా వరకు ఆదా అవుతుంది. గృహాలకు కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78వేల వరకు ఒక్కొక్కరికి సబ్సిడీ ఇస్తుంది.

- ఉడుముల బ్రహ్మారెడ్డి, పీడీ, నెడ్ క్యాప్



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం



- జీతం రూ.13200.. కటింగ్ రూ.9400
- హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోతలే కోతలు
- గగ్గోలు పెడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు
- నవంబరు నుంచి మిగిలిన సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ లింకు

హాజరు లింకు.. జీతం కోత

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆ ఉద్యోగులకు పని కాదు.. హాజరు ముఖ్యం అంట. హాజరు ఆధారంగానే వారికి జీతం ఇస్తారంట. ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) పేరుతో ఉద్యోగులకు భారీగా జీతాల్లో కోత పడుతుంది. దీంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా అధికారులు ఆలకించడంలేదు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు అక్టోబరు నెల జీతంలో భారీగా కోత పడింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటిజెంట్ వర్కర్‌గా పనిచేసే ప్రత్తిపాటి పద్మ జీతం రూ.13200 కాగా ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో అక్టోబరు జీతంలో రూ.9400 కోత విధించారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 70 మంది రెండో ఏఎన్‌ఎంలకు నెలకు రూ.23 వేలు జీతం కాగా వారిలో ఎక్కువ మందికి రూ.6 వేలు చొప్పున కోత విధించారు. ఇక డాక్టర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు జీతాల్లో కూడా కోత పడినట్లు సమాచారం. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కొంతమంది ప్రతి రోజు ముఖ ఆధారిత హాజరు వేసినా అది డేటా బేస్‌కు వెళ్లక పోవడంతో గైర్హాజరుగా చూపిస్తున్నట్లు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని స్థాయిల్లోని ఉద్యోగులకు ఇక మీదట ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగానే జీతాలు చెల్లింపు జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నవంబరు నుంచే ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల చెల్లింపులు జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో ఇదే ఉత్తర్వులను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు పరిచారు. ఇప్పుడు వైద్య, ఆరోగ్య శాఖలో మిగిలిన ఉద్యోగులకు దాన్ని విస్తరించారు.

వైసీపీ హయాంలో అమలు..

గత ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖలో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానం ప్రవేశ పెట్టింది. అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఉద్యోగి రోజుకు మూడు సార్లు హాజరు వేయాలన్న నిబంధనను గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో వైద్య శాఖ లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశించిన సమయంలో, నియమించిన ప్రదేశంలో ఉండి ముఖం చూపిస్తూ హాజరు వేయాలి. ఉదయం 9 గంటలకు ఇన్ పంచ్, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 మధ్య మిడ్ పంచ్, సాయంత్రం 4 గంటల ఔట్ పంచ్ వేయాలి. ఉదయం 9 నుంచి 9.10 నిమిషాల వరకు ఇన్ పంచ్ పడుతుంది. సమయం దాటితే హాజరు నమోదుకి సంబంధిత డ్రాయింగ్ అధికారి అనుమతి(అప్రూవల్) ఇవ్వాలి. వాస్తవానికి క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ విధమైన హాజరు విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. సమయంతో పని లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్షేత్రస్థాయి సిబ్బందిని ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై నిర్ణయం వస్తుందని ఎదురు చూస్తున్న తరుణంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ఏకంగా జీతాలకు లింకు చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



సమయంతో ముడిపెట్టలేని ఉద్యోగం

వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమయంతో పనిలేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉదాహరణకు ఓ గర్భిణీ నొప్పులు పడుతుంటే అది అర్ధరాత్రి అయినా సరే ఏఎన్ఎం, ఆశా కార్యకర్త బాధితురాలితో కలిసి ఆస్పత్రికి వెళ్లాల్సిందే. గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి ఎపిడిమిక్ ప్రబలినప్పుడు రాత్రి వేళ కూడా విధుల్లో ఉండాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ సమయం అని అనడానికి లేదు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సిన సిబ్బందిని కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ చట్రంలో బిగించి జీతాలు కోత అనడం వైద్య ఆరోగ్యశాఖలో నిరసనకు కారణం అవుతుంది.

అనాలోచిత నిర్ణయం అమలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వెనక్కి తీసుకుంటారని ఆశించాం. అయితే ప్రభుత్వ పెద్దలకు తెలుసో లేదో తెలియదు కానీ ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు నిర్ణయం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు అంటే జరగదు. సాయంత్రం 4 తర్వాత విధులు ఉండవు అంటే ఎఫ్‌ఆర్‌ఎస్ జీతాలకు లింక్ చేయండి. అధికారులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- మలినేని భానుమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం

మిషన్‌పాత్ హోల్ ఫ్రీ ఏపీలో భాగంగా గుంతలు పూడ్చుతున్న ఎమ్మెల్యే జూలకంటి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు



బుగ్గవాగు ఆధునికీకరణకు చర్యలు

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు మెచ్చుకోలు

రెంటచింతల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బుగ్గవాగు ఆధునికీకరణకు చర్యలు చేపడతామని కలెక్టర్ పి.అరుణబాబు తెలిపారు. మిషన్‌పాత్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంచికల్లు గ్రామ రహదారిలోని గుంతలను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డితో కలిసి శనివారం కలెక్టర్ పూడ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మాచర్లలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి 5 ఎకరాలు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఒక పని పట్టుకుంటే దానిని సాధించే వరకు పట్టువీడరని కొనియాడారు. రాష్ట్రానికి కేంద్రం సీఐఆర్‌ఎఫ్ పథకం కింద రూ.399.65 కోట్లు మంజూరు చేస్తే అందులో మాచర్ల పరిధిలోని 4 రోడ్లకు రూ.117.70 కోట్లు మంజూరు చేయడం బ్రహ్మారెడ్డి పట్టుదలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైసీపీది గుంతలు తవ్వే రాజకీయమైతే తమది ఆ గుంతలను పూడ్చి రహదారి నిర్మాణం చేసే రాజకీయమన్నారు. దమ్ము ట్రాక్టర్ల కారణంగా రోడ్లు ఛిద్రమవుతున్నాయన్నారు. కి.మీ రూ.కోటి ఖర్చుపెట్టి నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయిందని, రైతులు ఈ విషయంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్, డీఈ రమణయ్య, ఏఈఈలు యూసఫ్, సుబ్బారావు, సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శీలంనేని బ్రదర్స్ యరపతినేని మట్టయ్య, అర్జున్, సాంబయ్య, సుమంత్‌రెడ్డి, శౌరెడ్డి, రాయపరెడ్డి, బి.రామకృష్ణ, మందలపు హనిమిరెడ్డి, డీసీ మాజీ చైర్మన్ ఎన్.నరశింహారావు, కె.నాగయ్య, మాజీ ఎంపీపీ నర్శిరెడ్డి పాల్గొన్నారు.

- భూసేకరణకు అత్యుత్తమ పద్ధతిపై సీఆర్‌డీఏ దృష్టి
- యజమానులకు మేలు చేసే అవకాశాల పరిశీలనకు కన్సల్టెన్సీ
- ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 41 గ్రామాలు.. 96.25 కిమీ పొడవున ఐఆర్‌ఆర్

అమరావతి ఐఆర్‌ఆర్‌లో ముందడుగు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) నిర్మాణంలో సీఆర్‌డీఏ స్పీడ్ పెంచింది. ఇన్నర్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూముల సేకరణకు అత్యుత్తమ పద్ధతిని సూచించేందుకు కన్సల్టెన్సీని నియమించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దీనికోసం శనివారం టెండర్లు పిలిచింది. ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ఇటీవల అదానీ సంస్థ ముందుకు వచ్చిన నేపథ్యంలో సీఆర్‌డీఏ మరో ముందడుగు వేసింది. ఐఆర్‌ఆర్ ఫైనల్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో భూములను సేకరించడానికి ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై కన్సల్టెన్సీ తగిన ప్రతిపాదనలు సూచించాల్సి ఉంటుంది. భూములను తీసుకోవడానికి భూసేకరణ విధానం ఉన్నప్పటికీ.. ఇంకా అత్యుత్తమ ప్రతిపాదన ఏమైనా ఉంటే.. అది ఆమోదయోగ్యంగా అనిపిస్తే దానిని అమలు చేసే అవకాశం ఉంది.



ఇన్నర్ రింగ్ రోడ్డు శాటిలైట్ మ్యాప్

భూములు ఇచ్చిన వారికి కూడా ప్రయోజనకరంగా ఉండాలన్నది సీఆర్‌డీఏ భావన. భిన్నవిధానాలతో కూడిన సలహాలు, సూచనలు, ప్రత్యామ్నాయాల కోసం కన్సల్టెన్సీ సంస్థను నియమించాలనుకుంటోంది. ఈ నెల 18 లోపు బిడ్లను సమర్పించాలని సీఆర్‌డీఏ అధికారులు టెండరులో పేర్కొన్నారు. బిడ్ దక్కించుకున్నాక నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలి. కన్సల్టెన్సీ నివేదిక వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని..

అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇన్నర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. రాజధానికి ప్రాంతీయ రోడ్లు అనుసంధానమయ్యేలా ఐఆర్‌ఆర్ నిర్మించడం మొదటి అంశం. విజయవాడ నగరానికి ట్రాఫిక్ సమస్యను తగ్గించడం రెండో అంశం. రాజధాని ప్రాంత పరిధిలోని మేజర్ రోడ్లన్నింటినీ అనుసంధానం చేయడం మూడో అంశం. అమరావతి, విజయవాడ చుట్టుపక్కల అర్బన్ ప్రాంతాల అనుసంధానం నాల్గో అంశం. మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున 75 మీటర్ల వెడల్పుతో ఈ ఐఆర్‌ఆర్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను రూపొందించారు. ఐఆర్‌ఆర్ కోసం మొత్తంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 41 గ్రామాల పరిధిలో భూములను సేకరించాల్సి ఉంది.

ఐఆర్‌ఆర్ వెళ్లే గ్రామాలు ఇవీ..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అమరావతి మండలంలో ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, దుగ్గిరాల మండలంలో తుమ్మపూడి, మంగళగిరి మండలంలో చినకాకాని, చినవడ్లపూడి, కాజా, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ మండలంలో కంతేరు, మోతడక, తాడికొండ, తుళ్లూరు మండలంలో అనంతవరం, హరిశ్చంద్రాపురం, పెదపరిమి, వడ్డమాను గ్రామాలు ఉంటాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో.. జి.కొండూరు మండలం కవులూరు, వెలగలేరు, గన్నవరం మండలంలో రామచంద్రాపురం, సావారిగూడెం, వెదురుపావులూరు, ఇబ్రహీంపట్నం మండలంలో దాములూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కేతనకొండ, కొండపల్లి, కొటికలపూడి, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, పెనమలూరు మండలంలో చోడవరం, గంగూరు, పెనమలూరు, పోరంకి.. విజయవాడ రూరల్ మండలంలో దొనె ఆత్కూరు, నిడమానూరు, నున్న, పాతపాడు, తాడేపల్లి, కొత్తూరు గ్రామాలు ఉన్నాయి.

ఇంజనీర్ల నియామకాలు

- వేటుపడిన డీఈ, ఏఈల స్థానంలో..
- పబ్లిక్ హెల్త్ శాఖ ఎస్సీ ఉత్తర్వులు జారీ

నరసరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి వేటు పడిన పిడుగురాళ్ల మున్సిపల్ డీఈ వీ శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ ఏఈ టీ రాఘవేంద్రరావు స్థానంలో ఇంజనీర్లను నియమిస్తూ పబ్లిక్ హెల్త్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పిడుగురాళ్ల డీఈగా టీ రమేష్‌ను నియమించారు. సత్తెనపల్లి పబ్లిక్‌హల్త్ డివిజన్ డీఈఈ ఆర్‌వీ శ్రీనివాసరావు గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకు నియమితులయ్యారు. నరసరావుపేట పీహెచ్ ఏఈ షేక్ మహమూద్ కాశీం మాచర్ల ఏఈగా, సత్తెనపల్లి పీహెచ్ ఏఈ ఆర్ రాములునాయక్ దాచేపల్లి నగర పంచాయతీ ఏఈగా నియమితులయ్యారు. వీరికి ఎఫ్ఏసీ ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులను పబ్లిక్ హెల్త్ శాఖ ఎస్సీ డీ శ్రీనివాసరావు జారీ చేశారు. నియమితులైన ఇంజనీర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు.

గర్భిణీకి రెండుసార్లు ఆపరేషన్ చేసిన డాక్టర్

● పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రుల ఆవేదన



గురజాల ప్రభుత్వ వైద్యశాలలో శిశువుతో ఏసురాణి

గురజాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గురజాల ప్రభుత్వ వైద్యశాలలో ఈనెల 15వ తేదీన నిండు గర్భిణీకి డాక్టర్ ఆపరేషన్ చేయగా మగ శిశువు జన్మించింది. కాగా ఈ గర్భిణీకే మరోసారి కూడా ఆపరేషన్ చేయడంతో పరిస్థితి విషమంగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటన గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గురజాల మండలం చర్లగుడిపాడుకు చెందిన పేరుపోగు సలామన్, ఇస్తేరి దంపతుల కుమార్తె నిండు గర్భిణీ అయిన ఏసురాణి ఈనెల 15వ తేదీన గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఈమెకు డాక్టర్ హసీనా ఆపరేషన్ చేశారు. అయితే వారం రోజుల తరువాత కుట్లు వేసిన చోట చీము, రక్తం వస్తుండడంతో డాక్టర్ హసీనా సెలవులో ఉండగా డ్యూటీలో ఉన్న మరో డాక్టర్ ఆమెకు చికిత్సనందించి డాక్టర్ హసీనాకు ఫోన్ చేసి తెలిపారు. డాక్టర్ హసీనా హాస్పిటల్‌కు వచ్చి గర్భిణీని పరీక్షించారు. అనంతరం ఈనెల 29వ తేదీన ఆసుపత్రిలో ఏసురాణి తల్లిదండ్రులకు తెలియకుండా డాక్టర్ హసీనా కుట్లు మొత్తం తీసి ఆపరేషన్ చేశారు. మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని చెప్పి మళ్లీ డాక్టర్ హసీనా సెలవుపై వెళ్లారు. అయితే శనివారం ఏసురాణికి కుట్లు వేసిన చోట మళ్లీ చీము, రక్తం కారుతుండడంతో గుంటూరు తీసుకొని వెళ్లాలని వైద్యులు ఆమె తల్లిదండ్రులకు సూచించారు. దీంతో ఏసురాణి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆసుపత్రికి చేరుకొని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సుధీర్‌ను నిలదీశారు. ఏసురాణికి ఏదైనా జరిగితే మీదే బాధ్యత అంటూ మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చిన మొదలు టెస్టులన్నీ బయట చేయించుకోమన్నారంటూ ఆరోపించారు. అనంతరం ఏసురాణిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఏసురాణికి చికిత్సను అందిస్తున్నారు.

విజయవంతమైన వివా విద్యార్థుల ఆవిష్కరణలు



వివా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జర్మనీ విద్యార్థిని

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలోచన, పరిజ్ఞానాన్ని పంచుకుంటూ సృజనాత్మకతకు సాంకేతిక మేళవింపుతో వివా విద్యార్థులు జర్మనీ విద్యార్థులతో కలసి రూపొందించిన నూతన ఆవిష్కరణలను వివా పాఠశాల వేదికగా విజయవంతంగా శనివారం ప్రదర్శించారు. మేక్థాన్-2024లో భాగంగా జర్మనీకు చెందిన ఓం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో వివా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి రూపొందించిన మూడు అవిష్కరణలు బ్లైండ్ స్టిక్ (కళ్లులేని వారిని రహదారులపై అప్రమత్తం చేసే చేతికర్ర), ఎకో మోషన్ మూస్, (పల్స్ పెడల్)నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్‌లను ముఖ్యఅతిథి మాజీ డీజీపీ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త లావు నాగేశ్వరరావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో ప్రదర్శించారు. మూడు దశలలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా విద్యార్థులు వారి ఆలోచనలను పంచుకొని మూడు ఆవిష్కరణలను ఎంచుకున్నారు. రెండో దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్థాన్‌లో పాల్గొని ఆవిష్కరణల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. మూడో దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో విజయవంతంగా ఆవిష్కరణలను రూపొందించారు. ముఖ్యఅతిథి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత విద్య అనేది విద్యార్థులకు అవసరం అన్నారు. లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి మేక్థాన్లు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రొఫెసర్ బెర్నార్డ్ మాట్లడుతూ ఒకే ప్రాంగణంలో కళాశాల, పాఠశాల ఉండటం ద్వారా ఈ మేక్థాన్ నందు సాంకేతిక అంశాలలో పరిష్కారాలను సులువుగా సాధించగలిగామని తెలిపారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్ కమాండర్ కె.ఎస్ రావు, ఉపాధ్యయులు ఎ.కె.మాధవి, వై.ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా కేంద్రాల తనిఖీ

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ (యూజీ) 3వ సెమిస్టర్ రెగ్యులర్ అండ్ సప్లమెంటరీ పరీక్షల కేంద్రాలను డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.వి.కృష్ణారావు శనివారం తనిఖీ చేశారు. మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్, వీజేపీ కళాశాలలను సందర్శించారు. పరీక్షల కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు.

పింఛన్ డబ్బుతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్

గురజాల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల డబ్బు రూ. 2.30 లక్షలతో పరారైన మండలంలోని తేలుకుట్ల గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ బత్తుల వెంకటనారాయణ సస్పెండ్‌కు గురైనట్లు ఎంపీడీవో గౌసియా బేగం శనివారం తెలిపారు. వెంకటనారాయణను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

పింఛన్ సొమ్ముతో ఉద్యోగి పరార్

ఈపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ముతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరారైన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ బాణావత్తు గోవర్ధన నాయక్ రూ. 1.76 లక్షలు పింఛన్ సొమ్ముతో కన్పించకుండా పోయాడని సెక్రటరీ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు 73 పింఛన్ల పంపిణీకి డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. 1వ తేదీన 34 మందికి పంపిణీ చేసిన గోవర్ధన్ నాయక్ 39 పింఛన్‌లకు సంబంధించి రూ.1.76 లక్షలు సొమ్ముతో పరారైనాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో పంచాయతీ కార్యదర్శి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయితే గోవర్ధన్ నాయక్ భార్య పింఛన్ తాలూకా సొమ్మును ఫోన్‌పే చేశారని, పింఛన్ పంపిణీ చేసినట్లు సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురజాల పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత అంబాపురంకు చెందిన లోకసాని నాగిరెడ్డి (38) బ్యాంకు పనిపై ద్విచక్ర వాహనంపై గురజాలకు వస్తుండగా పట్టణ శివారులోని హైవే వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో నాగిరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



భరత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

మాచర్లటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అలుగురాజుపల్లిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్న వన్నర్లి భరత్‌కుమార్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా, చెట్టూరు మండలం, చింతర్లపల్లి గ్రామానికి చెందిన వన్నర్లి నాగరాజు కుమారుడైన భరత్‌కుమార్ శనివారం కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం తరువాత ఒక్కడే పట్టణంలోని విష్ణుప్రియ లాడ్జి వెనుక ఉన్న స్టూడెంట్స్ రూమ్‌కు చేరుకున్నాడు. రూమ్‌లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌కు ఉన్న హుక్‌కు ఫ్లెక్సీ బ్యానర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూసేసరికి భరత్‌కుమార్ ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారాన్ని కుటుంబసభ్యులకు అందించారు. భరత్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఈ ఏడాది మూడు ఆత్మహత్యలు..

కాగా ఈ ఏడాది ఇదే కళాశాలకు చెందిన మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. జూలై 20వ తేదీన బీటెక్ ఫైనల్ ఇయర్ చదవుతున్న దొడ్డి పవన్ కల్యాణ్ (24) పట్టణంలో తన రూంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా, ఆగస్టు 5న బీటెక్ సెకండ్ ఇయర్ చదవుతున్న జక్కిరేణుక యల్లమ్మ (21) కళాశాల హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం కష్టపడి చదివిస్తుంటే కారణం ఏదైనప్పటికీ ఉరివేసుకొని అర్థాంతరంగా ప్రాణాలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై అరెస్టు



కృష్ణవేణి (ఫైల్ ఫొటో)

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావుపై, ఆయన అనుచరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో తాడేపల్లిలోని వైసీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటి కృష్ణవేణి (33) శనివారం అరెస్టు అయ్యారు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో తాడేపల్లికి వెళ్లి ఆమెను అరెస్టు చేసి చిలకలూరిపేట కోర్టులో శనివారం సాయంత్రం హాజరు పరిచారు. విచారణ అనంతరం కృష్ణవేణికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. కృష్ణవేణిపై స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన కందుల వెంకటరమణ ఇటీవల ఫిర్యాదు చేశారు. టీడీపీ వారిని కించపరిచే విధంగా ఆమె సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టినట్టుగా సమాచారం. ఆమె పుల్లారావు పేరును కూడా వాడి ఆయన్ను కూడా కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కృష్ణవేణిని అరెస్టు చేశారు.

దూర విద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

బాపట్ల, నవంబరు 02 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యలంకరోడ్డులో గల కస్తూర్బా బీఈడీ కళాశాలలో నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యాపరీక్షలు జరుగుతున్నాయి. గత 6 రోజులుగా జరుగుతున్న ఈ పరీక్షలలో మాస్‌కాపీయింగ్‌కు పెద్దఎత్తున పాల్పడుతున్నట్లు సమాచారం. విద్యార్థుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తూ ఇష్టానుసారంగా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని, డబ్బులివ్వని విద్యార్థులను వేరు చేసి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై విద్యార్థులు కళాశాల దగ్గర పెద్దఎత్తున విమర్శలు చేస్తున్నారు. వీరి వైఖరి వల్ల అనేకమంది పరీక్షకు గైర్హజరవుతున్నట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉమ్మడి గుంటూరు అండర్ - 19 నెట్ బాల్ జట్టు ఎంపిక



ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్ బాల్‌కు ఎంపికైన క్రీడాకారులు

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 నెట్ బాల్ జట్ల ఎంపికను చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 19 కార్యదర్శి నరసింహారావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుంటూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఈ బాల, బాలికల జట్లు ఆడనున్నాయి. అండర్ - 19 బాలుర జట్టుకు అఖిల్, మనోజ్ కుమార్, గోపీకృష్ణ, నిఖిల్, విష్ణు, అహమ్మద్ అర్రాఫ్, నాగ శివ, నరేంద్ర, డానీ, చరణ్, దుర్గా ప్రసాదు, సాయికృష్ణ, కౌశిక్ ఎంపికయ్యారు. కాగా బాలికల జట్టుకు సంజన, అంజు, సాహీర, వెంకట రమణ, హస్న, యమున శ్రీ, శ్రీదివ్య, మౌనిక, సానియా, లిఖిత, జెస్సిక, అర్చనలు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. వారిని సహాయ కార్యదర్శి పద్మాకరరావు, హెచ్ఎం కృపాదానం తదితరులు అభినందించారు.

విద్యార్థులను చితకబాదిన హాస్టల్ వాచ్‌మన్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

● వాచ్‌మన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



తల్లిదండ్రులను విచారిస్తున్న ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు విద్యార్థులను హాస్టల్ వాచ్‌మన్ చితకబాదిన సంఘటన శనివారం మండల కేంద్రం పెదనందిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు అమరావతి మండలం చిలుమూరు గ్రామానికి చెందిన గోవిందు నాగార్జున, లక్ష్మీఅన్నపూర్ణల ఇద్దరు కుమారులు జి. జ్యోతిరాజేష్, మోహన్‌ఆదిత్యలు ఈ ఏడాది స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరి జిల్లా పరిషత్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఇటీవల దీపావళి పండగకు ఇంటికి వెళ్లారు. సెలవులు ముగియడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల వద్ద వదిలిపెట్టేందుకు వచ్చారు. పాఠశాలకు వెళ్లమంటూ ఇరువురు విద్యార్థులు ఏడుస్తుండగా తల్లిదండ్రులు నచ్చజెప్పి వారిని వదిలిపెట్టి వెళ్లి పోయారు. అప్పటికే పాఠశాల వద్ద హాస్టల్ వాచ్‌మన్ విద్యార్థులను ఎందుకు ఏడుస్తున్నారు, పాఠశాలకు ఎందుకు వెళ్లరని మందలించి విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఇరువురు తలకు, కాళ్లకు గాయాలవ్వడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వనజాక్షికి ఘన నివాళి



అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాతృమూర్తి వనజాక్షి అంత్యక్రియలు శనివారం ఏలూరు జిల్లా పెదవేగి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరయ్యారు. వనజాక్షి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

స్కూల్ వ్యాన్ తగిలి బాలుడు మృతి

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ వ్యాన్ తగిలి 8 నెలల బాలుడు మృతి చెందిన సంఘటన బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెంలోని ఆనంద నగర్ ఎస్సీకాలనీలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మోచర్ల కృపాశేఖర్, సౌమ్యసునన్న దంపతులకు లేకలేక పుట్టిన మోచర్ల ప్రకాష్‌బాబును శనివారం బిడ్డ మేనత్త కృపావరం రోడ్డు పక్కనే ఆడిస్తుంది. ఆ సమయంలో స్కూల్‌వ్యాన్ పిల్లలను ఎక్కించుకునేందుకు అక్కడకు వచ్చి ఆగింది. పసిబిడ్డతో వెళ్లి వ్యాన్ దగ్గర కృపావరం నిలబడింది. కొద్దిసేపటికి వ్యాన్ కదలటంతో ఆదమరచి ఉన్న వారికి తగిలి కిందపడ్డారు. దీంతో బాలుడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కృపావరంకు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చి గ్రామస్తులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,087 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 30,242 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

పల్నాడు వార్తలు

ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాసరెడ్డి

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని, విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.

జోన్ డైరీ

● గురజాల పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పర్యటించనున్నారు. పట్టణంలోని వివిధ ప్రైవేటు కార్యక్రమాలలో ఆయన పాల్గొననున్నారు.

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈనెల 4న సోమవారం బెల్లంకొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. గురజాల మండలంలో జరిగే మిషన్ పాత్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతలరహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో పాల్గొననున్నారు.

గురజాల డీఎస్పీగా జగదీష్



డీఎస్పీ జగదీష్

గురజాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గురజాల డీఎస్పీగా బీ.జగదీష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గత సార్వత్రిక ఎన్నికల్లో గురజాల ట్రైనీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. మొదటి పోస్టింగ్‌గా ఇక్కడ నియమితులయ్యారు. డీఎస్పీకి జగదీష్‌కు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీ జంగానుకలిసిన

కారంపూడి టీడీపీ నేతలు

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలి సభ్యునిగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నియమితులు కావడంతో శనివారం గుంటూరులో కారంపూడి టీడీపీ నేతలు చిరుమామిళ్ల శ్రీను, బుచ్చయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగాను దుశ్శాలువలతో సన్మానించారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్‌గా నియమితులైన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాదు శనివారం గుంటూరులో మర్యాద పూర్వకంగాకలసి శుభాకాంక్షలు తెలిపారు. జంగా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంక రించాలని, టీటీడీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం శ్రీవాసవీ క్లబ్ ఆధ్వర్యాన 300 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు దాతలు ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ భవిరిశెట్టి రామారావు, వాసవీ సేవాదళ్ మహిళా కమిటి ప్రధాన కార్యదర్శి చిన్ని లక్ష్మి, ట్రెజరర్ మాడిశెట్టి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పిడుగురాళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పల్వరైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా పసుమర్తి సుబ్రహ్మణ్యం, భవనాశి నరసింహారావు, అధ్యక్షుడిగా జుజ్జూరి వెంకట కృష్ణ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కాకుమాను గోపి, కోశాధికారిగా పసుమర్తి రమేష్‌బాబు ఎన్నికయ్యారు.

ఎర్రం నాయుడుకి నివాళి

సత్తెనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి ఎర్రంనాయుడు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ప్రజావేదికలో టీడీపీ నేతలు ఎర్రం నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు సయ్యద్ పెద కరిముల్లా, మస్తాన్‌వలి, జాన్ బాబు, రాంబోబుడే, లోకేశ్వరరావు, అబ్దుల్లా, నాగరాజు, శ్రీను, కొండలు పాల్గొన్నారు.

తహసీల్దార్ భవానీశంకర్

బాధ్యతల స్వీకరణ

ముప్పాళ్ళ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ళ మండల తహసీల్దార్‌గా ఎం భవానీ శంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల క్రితం సెలవుపై వెళ్ళారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు విధుల్లో ఉన్నారు.

ఆలయంలో చోరీ

మాచవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాచవరంలోని పేరంటాలమ్మ దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ ఇనుప తలుపులను పగలగొట్టి లోపలున్న ఇత్తడి గంటలు, తాంబలం, శఠ గోపురం, హుండీలు, కుండీలు, కొన్ని కానుకలను ఎత్తుకు వెళ్లారని ఆలయ పూజారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు వరకు ఉంటుందన్నారు.

పాఠశాలలో తనిఖీ

మాచవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన మాచవరంలోని ఎస్టీ, బీసీ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులు ప్రగతికి చిహ్నాలు

- గుంతలు లేని రహదారులే కూటమి లక్ష్యం
- వైసీపీ పాలనలో అధ్వానంగా రోడ్లు
- ప్రమాదాల బారిన పడి అనేక మంది మృతి
- రోడ్డు ప్రమాద మరణాల నియంత్రణకు కూటమి ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



గుంటలు పడిన రోడ్డుపై తారు పోసి చదును చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రహదారులు ప్రగతికి చిహ్నాలని, రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా రహదారి మరమ్మతు పనులను కూటమి ప్రభుత్వం శరవేగంగా చేపడుతోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పాకాలపాడులో శనివారం గుంతలుగా మారిన రోడ్లను బాగు చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా మారాయని, రోడ్లు మరమ్మతులు చేయకపోవటంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్ని హామీలను అమలు చేస్తామని కన్నా తెలిపారు. రూ.10 లక్షలు నిధులతో పాకాలపాడులో ఒక కిలోమీటరు, రెంటపాళ్ళలో 2 కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతు పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొనికినేని సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ నన్నేసాహెబ్, కొఠారు పరబ్రహ్మ ప్రసాదు, పంచాయతీ రాజ్ డీఈఈ శివయ్య, జేఈ జగదీష్, టీడీపీ నేతలు , కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

సత్రశాల ఆలయ అభివృద్ధికి కృషి

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- మల్లికార్జునస్వామికి కార్తీకమాస పూజలు



ఆలయంలో ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

సత్రశాల(రెంటచింతల) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని గంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాన్ని టీటీడీ ఆర్థిక సహకారంతో ఆగమ పండితుల సలహా మేరకు నూతన హంగులతో తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామినిచ్చారు. కార్తీక మాసం తొలి రోజైన శనివారం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే అన్నదానం చేసిన చపారపు అంకిరెడ్డి కుటుంబీకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి దాతలూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ముందుగా వేద పండితులు మంత్రోచ్ఛాటనల నడుమ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వార్లకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, ప్రభురాజ్, నీలం మల్లయ్య, లింగయ్య, బి.రామకృష్ణ, నాళం పెదబాబు, నీలా సత్యనారాయణ, గోళ్ల వెంకట నారాయణ, మిట్టగుడిపాడు సర్పంచ్ గొట్టం ప్రమీలా గురవారెడ్డి, పోట్ల సతీష్, ఈవో గాదే రామిరెడ్డి, అర్చక స్వామి శర్మ పాల్గొన్నారు.

మంచికల్లుకు ఇద్దరు ఎమ్మెల్యేలు..

మంచికల్లు గ్రామానికి ఇద్దరు ఎమ్మెల్యేలున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంచికల్లు గ్రామ రహదారిలో మిషన్‌పాత్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుది మంచికల్లు స్వగ్రామం కాగా, తానేమో మాచర్ల నియోజకవర్గంలోని మంచికల్లు ఎమ్మెల్యేగా ఉన్నానని ప్రకటించారు. ఈ గ్రామంలో పనులు సకాలంలో పూర్తి కాకుంటే ఒకరికి ఇద్దరు ఎమ్మెల్యేలు వెంట పడతామన్న విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలని అనడంతో సభికులంతా ఒక్కసారిగా నవ్వారు. బుగ్గవాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని 4.50 టీఎంసీలకు పెంచడానికి ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు కృషి చేస్తామన్నారు.

అతిసార నియంత్రణకు సత్వర చర్యలు

- అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది

దాచేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ ఇంజనీరింగ్ విభాగంలో అధికారులు అతిసార నియంత్రణపై దృష్టి సారించారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో ఇటీవల అతిసారతో 15 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆరోగ్యశాఖ మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారులు కాలనీలో పర్యటించి అతిసార వ్యాప్తికిగల కారణాలపై ఆరాతీశారు. ఈసందర్భంగా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. పైపులైన్లు లీకేజీ, బోరు పక్కనే మురుగునీరు నిల్వ ఉండటం, ఇంజనీరింగ్ విభాగ పర్యవేక్షణ లోపం వంటివాటిని గుర్తించారు. ఇప్పటికే దాచేపల్లి నగర పంచాయతీ ఏఈగా పనిచేస్తూ మాచర్ల మున్సిపాల్టీకి బదిలీపై వెళ్లిన టీ.రాఘవేంద్రరావును సస్పెండ్ చేశారు. అదేవిధంగా సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై కూడా చర్యలు తీసుకునేందుకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు.

నగర పంచాయతీకి ఏఈ, డీఈల కేటాయింపు :

దాచేపల్లి నగర పంచాయతీలో డీఈగా ఆర్‌వీ శ్రీనివాస్, ఏఈగా రాములునాయక్‌లను ప్రభుత్వం నియమించగా శనివారం వారు బాధ్యతలు చేపట్టారు. వీరు సత్తెనపల్లి ప్రజారోగ్యశాఖ నుంచి బదిలీ వచ్చారు.

పీహెచ్‌సీలో తనిఖీ

మాచవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పలు గ్రామాల సబ్ సెంటర్లను పల్నాడు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి గీతాంజలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సబ్ సెంటర్‌ను సందర్శించారు. పీహెచ్‌సీ సబ్ సెంటర్ల రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట వైద్యాధికారి ప్రసాదరావు, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ సిబ్బంది ఉన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

దుర్గి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ సునీతాసాయిశంకర్ అన్నారు. దుర్గిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీవోఏ, వలంటీర్ టీచర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఎంపీపీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

రాజుపాలెం (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో జీవి సత్యానారాయణ కోరారు. శనివారం రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్ టీచర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యానారాయణ మాట్లాడుతూ 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగి చదువు ఆపేసి ఉన్నవారికి, చదువుకొని పెద్దలకు ప్రాథమిక అక్షరాస్యత, జీవన నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్యను అందించేందుకే ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునశర్మ, ఏపీఎం శివకుమార్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు

జీఆర్‌సీఆర్‌కే చైతన్య విద్యార్థులు

పెదకూరపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కిలో అండర్-14 వాలీబాల్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికలో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ డైరెక్టర్ గుత్తా కవిత రాము తెలిపారు. బాలికల విభాగంలో వేముల చరిత, బాలుర విభాగంలో కొండవీడు బోస్ సాయిలు ఎంపికయ్యారన్నారు.అలాగే సిరిపురంలో జిల్లాస్థాయిలో అండర్ - 14 అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల పోటీల్లో జీ హంసిక ద్వితీయస్థానంలో విజేతగా నిలిచినట్లు తెలిపారు. ఆదివారం ఏలూరులోజరిగే రాష్ట్రస్థాయి మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని అన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

నకరికల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నరసింగపాడు గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు రాయల తిరుపాలు నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం నకరికల్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు, నరసింగపాడు పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావులు ఆస్పత్రికి వెళ్లి తిరుపాలుకి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ నగదు రూ 6 వేలును అందజేశారు.

సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఎండ్లూరి జ్యోతి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి గ్రామ మహిళా పోలీసు బాణావత్ నాగలక్ష్మీతో కలిసి శనివారం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి జ్యోతికి రూ.15 వేలు పింఛన్‌ను అందజేశారు.

అమరేశ్వరాలయంలో

కార్తీకమాస ఏర్పాట్ల పరిశీలన



స్నానఘాట్ వద్ద ఈవోతో మాట్లాడుతున్న ఏఎస్పీ లక్ష్మీపతి

అమరావతి, నవంబరు2: కార్తీకమాసం పురస్కరించుకుని ప్రసిద్ధ అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులుచేసిన ఏర్పాట్లను కార్తీకమాస ప్రత్యేక అధికారి, అడిషనల్ ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి శనివారం పరిశీలించారు. ఎస్పీ కే. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, ఎస్‌హెచ్‌వో ఎం.శ్రీనివాసరావుతో కలసి ముందుగా స్నానఘాట్‌ను పరిశీలించారు. నదిలో గజ ఈతగాళ్లను పడవలపై ఉంచి వారికి పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం వాహనాల పార్కింగ్ స్థలం, ఆలయ ప్రాంగణంలో క్యూలను పరిశీలించారు. క్యూలలో ఎక్కువ సమయం నిరీక్షించకుండా భక్తులకు త్వరితగతిన స్వామి వారి దర్శనం జరిగేలా చూడాలని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వీ.సునీల్‌కుమార్‌కు సూచించారు. ప్రధాన రహదారి, ఆలయపరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటునట్లు ఏఎస్పీ తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని 200 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు కేటాయించినట్లు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి దోహదపడాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు కోరారు. ప్రాపర్టీ ట్యాక్స్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం రూ.50 వేలకు పైన పన్ను బకాయివున్న వారి వద్దకు స్వయంగా వెళ్లి పన్నులను వసూలు చేశారు. రామాటాకీస్ జానీ ప్రాపర్టీ ట్యాక్స్ రూ.53 వేలను చెక్కు రూపంలో కమిషనర్ వేణుబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బెల్లంకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీడీపీ మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి తెలిపారు. టీడీపీ సభ్యత్వం పొందినవారికి పార్టీ అనేక ప్రయోజనాలను కల్పించనుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, వీరారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చావలి రామకృష్ణ, బుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదు వేగవంతం

క్రోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నమోదు ప్రక్రియను వేగవంతం చేసినట్లు టీడీపీనేతలు తెలిపారు. అన్ని గ్రామాల్లో అర్హులైన పట్ట భద్రులందరికీ ఓట్ల నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 6వరకు ఓట్లను చేర్పించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు కాండ్రు కాశయ్య, గుడిపాడుబాషా, మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, అనుమాల పూర్ణ, రామిరెడ్డి, కిషోర్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో

ఆదాయం పెరుగుతుంది

ముప్పాళ్ళ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేయటం వల్ల ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని, ప్రకృతి వ్యవసాయం ఎస్‌ఎఫ్‌ఏ నందకుమార్ అన్నారు. మండలంలోని నార్నెపాడులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న మిరపలో అంతర్ పంటలుగా ఉల్లి, బంతి, ముల్లంగి, కొతిమేర, క్యారెట్ వంటి పైర్లను సాగు చేయటంతో నల్ల తామర పురుగులను అరికట్టవచ్చని తెలిపారు. రైతులు జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు వంటి వాటిని పైర్లలో వేయటం ద్వారా ఖర్చు తగ్గుతుందని, పంట దిగుబడి అధికంగా వచ్చి ఆదాయంపెరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ కే పూజ, ఐసీఆర్‌పీ సౌజన్య ఉన్నారు.

స్వయం సహాయక గ్రూపుల మహిళలు

విద్యా వంతులు కావాలి

క్రోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక గ్రూపుల మహిళలందరూ విద్యావంతులు కావాలని క్రోసూరు ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి విడతగా 390 మంది మహిళలు శిక్షణలో పాల్గొన్నారు. ఒక్కొక్క అంగన్ వాడీ కేంద్రంలో రోజుకు రెండు గంటల చొప్పున స్వయం సహాయక గ్రూపు సభ్యులకు చదవటం, రాయటంతో పాటు డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీ మొదలైన విషయాల పై శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటయ్య, ఏపీఎం కృపావేణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శిరీష, మాధవి పాల్గొన్నారు.



చింతపల్లి మేజరు కాలువలో నాచు తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఇరిగేషన్ ఏఈ బండి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే భాష్యం చొరవతో

కాలువలో నాచు తొలగింపు

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపల్లి మేజరు కాలువలో నాచు, పాచి తొలగింపు పనులు ఇరిగేషన్ ఏఈ బండి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కస్తల మైనర్ కాలువకు నీరురాక పోవటంతో వేలాదిమంది రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు ప్రవీణ్‌కు ఇటీవల వేల్పూరు రైతులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే నాచు తొలగింపు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కొండూరు సమీపంలోని చింతపల్లి మేజరులో 33.672 కిలో మీటర్ల వద్దనుంచి ఎగువకు పని ప్రారంభించారు. దీంతో కస్తల మైనర్ కాలువకు నీటి సరఫరా మెరుగు పడింది. కార్యక్రమంలో పొన్నెకంటి శ్రీనివాసరావు, కుంభా వీరయ్య, సురేంద్ర, వంశీ, నల్లపాటి శ్రీకాంత్, పొన్నెకంటి శ్రీనివాసరావు (జడ్పీటీసీ సభ్యుడు) పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై నిరంతరం పర్యవేక్షణ

దుర్గి తహసీల్దార్ ఫణీంద్రకుమార్

ఫటాఫట్



ఫణీంద్రకుమార్, దుర్గి తహసీల్దార్

దుర్గి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రభుత్వ భూములను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ హెచ్చరించారు. శనివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఫటాఫట్ ..

ప్ర: ప్రజల నుంచి ఏయే దరఖాస్తులు వస్తున్నాయి?

జ: తమ భూములు వేరే వ్యక్తుల పేర్లపై ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయంటూ రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. రైతుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుంటూ, సమస్యలకు గల కారణాలను వారికి వివరిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నాం.

ప్ర: వీఆర్వోల పనితీరు ఎలా ఉంది?

జ: వీఆర్వోలు విధులు బాగానే నిర్వహిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. తమ వద్దకు వచ్చిన రైతుల సమస్యలను తెలుసుకొని త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. అలాగే వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చినవారికి నిర్ణీత సమయంలో సర్టిఫికెట్లను అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

ప్ర: సిబ్బంది కొరత ఉందా?

జ: మండల పరిధిలో సిబ్బంది కొరత ఉంది. జూనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, ఓబులేశునిపల్లె వీఆర్వో పోస్టు ఖాళీగా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి త్వరితగతిన భర్తీ అయ్యేలా కృషి చేస్తాను.

ప్ర: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

జ: సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. ప్రజలు, రైతులతో అమర్యాదగా నడుచుకున్నా ఉపేక్షించేది లేదు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

క్రైమ్ జోన్

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్కరాజుగార్లపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గూడరు పుల్లారావు(40) మద్యానికి బానిసై కుటుంబ పోషణను పట్టించుకొనేవాడు కాదు. ఈ క్రమంలో 10 రోజుల నుంచి భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి పుల్లారావు మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న ఆయనను కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య ప్రభావతి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

క్రోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగావుంటున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు గుర్తుతెలియనివ్యక్తి దొంగిలించిన ఘటన శనివారం మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. వాసా నారాయణమ్మ(65) ఎర్రబాలెం గ్రామంలోని రోడ్డు పక్కన ఒంటరిగా నివశిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి బయట కూర్చున్న వృద్ధురాలి వద్దకువచ్చి ఆమె మెడలోని బంగారపు గొలుసు, కాసుల దండ, నల్లపూసల తాడు, మరికొన్ని బంగారు ఆభరణాలు తీసుకొని పారిపోయాడు. వాటి విలువ సుమారు రూ.4 లక్షలకు పైగా ఉంటుందని వృద్ధురాలు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను విచారించారు. పెదకూరపాడు సీఐ ప్రత్తిపాటి సురేష్, ఎస్‌ఐ నాగేందరరావు విచారణ చేపట్టారు.

ఎలుకల మందు తిని వృద్ధురాలి మృతి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తిని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలప్రకారం మండలంలోని గర్నెపూడికి చెందిన తురుమెళ్ళ నిర్మలమ్మ(60) కొన్నిరోజులుగా అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతోంది. ఆ బాధను తట్టుకోలేక ఐదు రోజుల క్రితం ఎలుకల మందు తిన్నది. కుటుంబ సభ్యులు ఆమెను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు గుంటూరు తరలించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి నిర్మలమ్మ మృతి చెందింది.



సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

మాచర్లటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం 30 మంది లబ్ధిదారులకు రూ.35,00,100 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు సీఎం రిలీఫండ్‌కు దరఖాస్తు చే సుకుంటే ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

పట్టణంలోని శ్రీశైలం రహదారిలో వేంచేసియున్న అయ్యప్పస్వామి ఆలయాన్ని, సొసైటీ కాలనీలో వేంచేసియున్న మాతా అన్నపూర్ణేశ్వరీ అమ్మవారిని శనివారం శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరంఆలయంలో ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించారు.

మినీ గోకుల నిర్మాణ పనులు ప్రారంభం

మాచవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అధికారులు మినీ గోకులాల నిర్మాణాలకు మార్కింగ్ పనులను ప్రారంభించారు. కొత్తపాలెంలో మూడు, మాచవరంలో మూడు నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. ఒక్కొక్క మినీ గోకులానికి రూ 2.30 లక్షలు మంజూరు కాగా, దానిలో లబ్ధిదారుని వాటా రూ23 వేలు ఉంటుందని ఎంపీడీవో, ఉపాధి హామీ పీవో పీ.శ్రీనివాసరావు తెలిపారు. ఎంత త్వరగా నిర్మాణాలు చేసుకుంటే అంత త్వరగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ నాయక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం


పిడుగురాళ్ల, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): గతరెండేళ్లుగా పిడుగురాళ్ల-కారంపూడి ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురికావడంతో పాటు పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో కూటమి ప్రభుత్వం ఇటీవల ఈ రహదారి మరమ్మతులకు నాబార్డు నిధులు రూ. కోటిన్నర మంజూరు చేసింది. దీంతో శనివారం జానపాడు హైస్కూల్ వద్ద నుంచి పందిటివారిపాలెంరోడ్డు వరకు మరమ్మతులు చేసి తరువాత పూర్తిగా తారురోడ్డు వేసేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు పనులు ప్రారంభించారు. మాచర్ల డీఈఈ రమణయ్య, ఏఈఈ యూసుఫ్ రెండురోజులుగా రహదారి పనులను పర్యవేక్షిస్తున్నారు.

రెస్టారెంట్లలో కొత్తదనాన్ని కోరుకుంటున్న వారు వింతైన అనుభూతిని పొందాలనుకుంటున్నారా! అయితే, రెస్టారెంట్ ఆన్ వీల్స్‌గా పిలవబడే రైలు కోచ్ రెస్టారెంట్లకు వెళ్లాల్సిందే. లోపలికి అడుగు పెడుతూనే శీతలమైన రూం టెంప రేచర్, కళ్లు మిరుమిట్లు గొలిపే ఇంటీరియర్స్, లైటింగ్స్, ఆరోగ్యకరమైన వాతావరణం మదిని దోచేస్తుంటాయి. ఇక రైలు బోగీలో ప్రయాణిస్తూ ప్రీతిపాత్రమైన వంట కాలను ఆరగిస్తుంటే 'ఆహా! ఆ మజానే వేరు' అని కుర్ర కారు అంటున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ వైపున ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్లు విశేషంగా ఆకర్షించడమే కాదు రోజురోజుకు ఆదరణని పెంచు కుంటున్నాయి. 24 గంటలు వారంలో ఏడు రోజులు సేవ లందించే రెస్టారెంట్లు కావడం వీటికి ప్లస్ పాయింట్. అర్ధరాత్రి అయినా అపరాత్రి అయినా వెళ్లి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు.

అడుగుపెడుతూనే కొత్త ప్రపంచం

- రెస్టారెంట్ ఆన్ వీల్స్
- రైల్వే కోచ్ రెస్టారెంట్లకు పెరుగుతున్న ఆదరణ

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గతంలో పాతబడిన భారీ పడవలను సముద్ర తీరానికి తీసుకొచ్చి వాటిని సందర్శన ప్రదేశంగా చేసేవారు. ఆ తర్వాత విమానాల వంతు వచ్చింది. విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో రైల్వేలో ఫుడ్ కాంట్రాక్టర్‌గా ఉన్న కోటిరెడ్డి అనే వ్యక్తి వీటి అనుభవం ద్వారా పాడుబడిన రైలు బోగీని రెస్టారెంట్‌గా ఎందుకు చేయకూడదని ఆలోచన చేశారు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా అప్పటి గుంటూరు డీఆర్ఎం మోహన్‌రాజాని సంప్రదించి తన ప్రణాళికను వివరించారు. అప్పటికే గుంటూరు రైల్వే డివిజన్‌లో శిథిలావస్థ స్థితికి చేరుకొన్న ఓ రైలు బోగీ ఉండటం, దాని ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో డీఆర్ఎం అంగీకరించారు. కోచ్ ఓవర్ హాలింగ్ డిపో నుంచి ఆ బోగీని తెప్పించి తొలుత గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అటు రైలు ప్రయాణికులు, ఇటు బయటి ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేయించారు.



కోచ్ రెస్టారెంట్ వెలుపల ఫుడ్ ఎక్స్‌ప్రెస్

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంట్రాక్టర్ కోటిరెడ్డి రైలు బోగీని అందంగా తీర్చిదిద్దారు. విలాసవంతంగా ఉండేలా మెరుగులు అద్దించారు. ఇందుకోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా రూ.50 లక్షలు వెచ్చించారు. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఏమిటన్న విమర్శలు ఆ సందర్భంలో లేకపోలేదు. అయినప్పటికీ ఆయన ముందుకెళ్లడంతో కోచ్ రెస్టారెంట్ అనతి కాలం లోనే రూపుదిద్దుకొంది. ఒకేసారి 50 మందికి పైగా కూర్చునేలా సీటింగ్‌ని తీర్చిదిద్దారు. ప్రతీ ఓపెన్ కంపార్టుమెంట్ వద్ద నలుగురు కూర్చుని కబుర్లు చెప్పు కొంటూ ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు. ప్రతీ కంపార్టుమెంట్‌కు ఎదురుగా అద్దంతో కూడిన కిటికీ వచ్చేలా డిజైన్ చేశారు. దీని వలన రైలులో ప్రయాణిస్తూ భోజనం చేస్తున్న అనుభూతి కలుగుతుంది.

రూ. 50 లక్షలతో ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌ల అభివృద్ధి


కోచ్ రెస్టారెంట్ లోపలి భాగం


వంటకాలు ఆరగిస్తున్న కస్టమర్లు

పోలీసుల భయం ఉండదు

సాధారణంగా గుంటూరు నగరంలో ఏ రెస్టారెంట్ అయినా రాత్రి 10 నుంచి 11 గంటల మధ్య మూసేయాలి. ఆ తర్వాత తెరిచి ఉంచితే పోలీసులు సైరన్ వేసుకొంటూ వచ్చి చర్యలు తీసుకొంటారు. దీని వలన అటు రెస్టారెంట్ల నిర్వాహకులు, ఇటు వినియోగ దారులకు ఇబ్బందికరం. కాగా, రైల్వే కోచ్ రెస్టారెంట్ల వద్ద అలాంటి భయం ఉండదు. ఇందుకు కారణం ఈ రెస్టారెంట్లకు 24 గంటల అనుమతి ఉంది. వీటికి పార్కింగ్ ప్రదేశాలు కూడా ఉన్నాయి. దీని వలన వాహనాలు చోరీకి గురవుతాయనే భయం ఉండదు.



రైల్వే కోచ్ రెస్టారెంట్

అన్ని ప్రాంతాల ప్రయాణికులు ఇష్టపడే వంటకాలు

రైల్వేస్టేషన్ అనగానే ఒక గుంటూరు జిల్లాకు చెందిన ప్రయాణికులే రారు. దేశం నలుమూలల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫుడ్ మెనూని రూపొందించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రింతా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు వేడివేడిగా వడ్డిస్తుంటారు. నార్త్ ఇండియన్స్ ఇష్టపడే వంటకాలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఇక అన్నిరకాల బెవరేజస్‌ని అందు బాటులో ఉంచారు. తాజా పండ్ల రసాలు, చైనీస్ ఫుడ్ ఐటెమ్స్ కూడా ఆర్డర్ చేసిన కొద్దిసేపటికే తీసుకొచ్చి సర్వ్ చేస్తున్నారు. రేట్లు కూడా సాధారణ రెస్టారెంట్లలో మాదిరే ఉన్నాయి.

రైల్వేస్టేషన్ పశ్చిమ వైపునే డిమాండ్ పెరగాలి

రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు 24 గంటలు జనాదరణ ఉంటోంది. ఈ ఏడాది ఎన్నికలకు ముందు వెస్ట్ టెర్మినల్ వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు ఇంకా డిమాండ్ పెర గాల్సి ఉంది. వెస్ట్ టెర్మినల్ ఇంకా అధికారికంగా ఓపెన్ కాకపోవడం, ఎక్కువ రైళ్లు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకే తీసుకొంటుండటంతో ప్రయాణికుల రద్దీ అటు వైపునే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వెస్ట్ టెర్మినల్ త్వరగా ప్రారంభించి కొన్ని ముఖ్యమైన రైళ్లను ఏడో నెంబరు ప్లాట్‌ఫాంకు తీసుకుంటే ఇటువైపున కూడా రాకపోకలు పెరిగి.. వెస్ట్ సైడ్ కోచ్ రెస్టారెంట్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. అలాగా, ఈస్ట్ సైడ్ రెస్టారెంట్‌కు ఉన్నంత పబ్లిక్ యాక్సెస్ వెస్ట్ సైడ్ లేక పోవడం కూడా దీనికి కొంత ప్రతికూలంగా మారింది.



బాలకుటీర్ నిర్వహించే లలితా కళా పోటీలకు ఆహ్వానం

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లలిత కళలను ప్రోత్సహించటం కోసం సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన గరిగె ప్రభావతి స్మృతి దినోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ 29 ఏళ్లుగా డిసెంబరు 10వ తేదీన లలిత కళా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ నన్నపనేని మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు 'ప్రతిభా పల్లవం' పురస్కారాన్ని, బాల సాహితీ సృజనకర్తలకు 'మంగాదేవి బాల సాహిత్య పురస్కారాన్ని' సాహిత్య రంగానికి విశేష సేవలందిస్తున్న మహిళలకు మాలతీ ప్రమదా సాహితీ పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్నట్లు చెప్పారు. బాలల సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించటానికి రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులను, గురువులను ఆయా పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించా ల్సిందిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డాక్టర్ మంగాదేవి విజ్ఞప్తి చేశారు. పోటీలు గాత్రం, వాద్య సంగీతంలో వ్యక్తిగతంగాను, బృంద గానాల రూపంలోనూ ఉంటాయని, వాటితో పాటు చిత్రలేఖనం, కథా రచన, లేఖా రచనలలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఉత్తమస్థానాల్లో నిలిచిన బృందాలకు బహుమతుల కింద ఒక్కొక్క బృందానికి రూ. 5వేలు, రూ. 4వేలు, రూ. 3వేలు, గురువులకు రూ.4వేలు, రూ. 3వేలు, రూ. 2 వేలు బహుమతులు ఉంటాయన్నారు. పోటీదారులు ఆన్‌లైన్‌లో మాత్రమే రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నవంబరు 18 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు నిర్వహించే పోటీల వివరాలను శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, మూడో లైను, శ్యామలానగర్, గుంటూరు (0863-2232405, 9390115480, 7729967589, 8121590409) లో సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఫారం స్కూల్ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌వీబీకే. ఇన్ లేదా సర్క్యులర్‌లో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పొందవచ్చని తెలిపారు.

అండర్ - 19 ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



అండర్ - 19 ఫుట్‌బాల్ బాల బాలికల జట్లు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాల బాలికల ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జరిగాయి. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 110 మంది క్రీడాకారులు హాజరైనట్లు అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర జట్టు డీ సాయి కుమార్, ఎం ముఖేష్, వై కార్తీక్, వీ విల్ స్మిత్, ఏ గోపీ సందీప్, జే మోజెష్, ఏ స్టాలిన్, ఏ ఫైజక్, ఎస్ రేవంత్, జీ గిరి ప్రతాప్, పీ యాసిన్ ఖాన్, షేక్ ఆరీఫ్, జీ ప్రదీప్, షేక్ ఫరీదు, డీ అనేష్, కే నరేష్, ఎం రిషీ, స్టాండ్‌బైలుగా పీ వేణుగోపాల్, షేక్ ఖాజా మొహిద్దీన్, పీ కిరణ్ కుమార్, ఎం వినయ్ తేజ, షేక్ జుబేర్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎల్ శివ దుర్గ, కే వెంకట త్రివేణి, జీ శ్రీలక్ష్మి, సీహెచ్ జ్ఞాన శ్రీ అర్చన, వీ అఖిల, కే కారుణ్య, ఓ దీవెన, వీ మౌనిక, టీ యామిని, ఎం నవ్య, ఎం అమ్ములు, ఎం పవిత్ర పావని, కే హేమ రాజేశ్వరి, జీ సౌజన్య డీ కోమలి, ఎం శ్రీలక్ష్మి మహేశ్వరి, కే బ్లెసీ, ఎస్ రమ్య, స్టాండ్ బైలుగా కే రాజ్యలక్ష్మి, ఎస్ షబానా, టీ లావణ్య జీ కుసుమలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, వీ అనీల్ దత్త నాయక్, కే సునీత, యూ సత్యవతి, షేక్ పెద కరిముల్లా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వేలో గుర్తింపు ఎన్నికల సందడి

- డిసెంబరు 4, 5, 6 తేదీల్లో పోలింగ్
- 4,500 మందికి పైగా ఉద్యోగులకు ఓటు హక్కు
- యూనియన్, సంఘ్‌ల పోటాపోటీగా హామీలు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొన్నది. ఎన్నికల నిర్వహణ తేదీలను రైల్వే శాఖ ఖరారు చేయడంతో గత కొన్ని రోజుల నుంచి మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగడం, దశాబ్దం తర్వాత ఎన్నికలు జరగబోతుండటంతో పెద్ద సంఖ్యలో హామీలను గుప్పిస్తున్నాయి. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తొలి నుంచి మజ్దూర్ యూనియన్ సత్తా చాటుతూ వచ్చేది. అయితే 2013లో మాత్రం సంఘ్ గెలిచి సంచలనమే సృష్టించింది. ఈ దఫా ఎలాగైనా గెలవాలని మజ్దూర్ యూనియన్, తన పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకొంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నాయి.



గుంటూరు రైల్వేస్టేషన్

8వ వేతన సంఘం ఏర్పాటుకు పోరాటం: ఎంపీ ప్రసాద్, డివిజనల్ సెక్రెటరీ



2026 జనవరి 1వ తేదీ నాటికి నివేదికతో 8వ వేతన సంఘం ఏర్పాటు. ఓపెన్ లైన్ డిపార్టుమెంట్ ఉద్యోగు లందరికి రిస్క్, హార్డ్ డ్యూటీ అలవెన్స్. ట్రాక్ మెయిం టెనర్లకు రిస్కు అలవెన్స్ పెంపు, పని భారం తగ్గింపునకు ప్రయత్నం. కీమెన్, మేస్త్రీల కోసం జీపీ 4200. అదనపు 10 శాతం ఎల్‌డీసీఈ అందరికి తెరవడం. ఉద్యోగులం దరికి ద్విచక్ర వాహన భత్యం. అందరికి 8 గంటల పని విధానం. 500 రోజుల వరకు ఆర్జిత సెలవు, పదవీ విరమణ సమయంలో 360 రోజుల ఎన్‌క్యాష్‌మెంట్‌కు మంజూరు ఇప్పించడం. మెడికల్ అలవెన్స్ రూ. 3 వేలు వేసైడ్ స్టేషన్ ఉద్యోగులకు ఇప్పించేందుకు ప్రయత్నం. హెచ్ఆర్ఏ ఎక్స్ తరగతి నగరాలకు 40 శాతం, వై తరగతి నగరాలకు 30 శాతం, జెడ్ క్లాస్ నగరాలకు 20 శాతం పెంచేలా చూడటం. అన్నిరకాల క్వార్టర్లలో ఒక గది ఎయిర్ కండీషనింగ్ చేయించడం. తల్లిదండ్రులకు పాస్, వైద్య సదుపాయాల కల్పన. రన్నింగ్ సిబ్బందికి వారానికి 46 గంటల విశ్రాంతి. 70 శాతం రన్నింగ్ అలవెన్స్ ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ప్రయత్నం.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి: రమణయ్య, సంఘ్ డివిజనల్ సెక్రెటరి



రైల్వేలలో నూతన పెన్షన్ విధానాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పింఛన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం(యూపీఎస్) అమలుకు పోరాటం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ ఆక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ. 32,500 ఇప్పించడం. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ/డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాడతాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. రైల్వేలో 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో అన్ని కేటిగిరీలకు గ్రేడ్‌పే రూ. 4600లకు బదులుగా రూ. 4800 అమలు చేసేందుకు ఒత్తిడి చేస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటిగిరీకి 4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వేబోర్డుతో మాట్లాడతాం. రైల్వే ఉద్యో గుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స, పాస్ సౌకర్యాల కల్పనకు ప్రయత్నం. ట్రాక్ మెయింటెనర్ల పని గంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎస్ఎఫ్ఐఆర్ డిమాండ్ నెంబరు. 1/2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికి వర్తింపు చేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకొన్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంధ ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి. ఇలా మరికొన్ని హామీలను సంఘ్ ఇచ్చి ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం

బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చదలవాడ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. శనివారం స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలికల బాస్కెట్‌బాల్ 2024 - 25 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కేవలం చదువుల మీద దృష్టి పెట్టకుండా పిల్లలను తల్లిదండ్రులు క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. తొలుత ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక, రాజకీయాలను విశ్లేషించిన 'మానవాళికి మహోదయం'

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న రచయిత పాపారావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాల కాలంలో ప్రపంచంలో జరిగిన ఆర్థిక, రాజకీయలను విశ్లేషించిన గొప్ప పుస్తకం 'మానవాళికి మహోదయం' అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావు రచించిన 'మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం' పుస్తకాన్ని శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సభకు గుంటూరు క్లబ్ బుక్ రీడర్స్ అధ్యక్షుడు కాపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2008లో ఆర్థిక సంక్షోభం అనంతరం నిర్దిష్టంగా వాస్తవ రూపం దాలుస్తున్న పరిణామాలు రచయిత వాదనలకు తార్కాణంగా ఈ పుస్తకం నిలబడిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ 2024లో మరింత ఉధృతంగా కమ్ముకొస్తున్న మాంద్యం మేఘాలు వంటి అంశాలు ఈ పుస్తక ప్రచురణకు రచయితను ప్రేరేపించాయన్నారు. పుస్తక రచయిత పాపారావు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారి దోపిడీకి గుండెకాయగా, వెన్నుదన్నుగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ పునాదులు కదిలిపోతున్నాయన్నారు. సమాధిలోకి సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని 2012లో రచించానని, దానికి మరింత అదనపు సమాచారం జోడించి 'మానవాళికి మహోదయం' పేరుతో మరో పుస్తకాన్ని విడుదల చేశానన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మల్లికార్జునరావు, సీపీఎం నాయకులు బైరగాని శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకత మొదలు

- దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి
- వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై నాలుగు నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకత మొదలైందని మాజీ ఎంపీ, వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వైసీపీ గుంటూరు నగర అధ్యక్షుడుగా డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ప్రమాణ స్వీకారం శనివారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీలు చేసిన దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి పాలైందన్నారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప చర్యలుండటం లేదని విమర్శించారు. ప్రజల పక్షాన కార్యకర్తలు నిరంతరం పోరాడాలన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో సమయం లేదని, 2027లోనే ఎన్నికలు ఉండే అవకాశం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండా విజయం సాధించేలా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అన్నీ మాయమాటలే తప్ప చేతలు లేవని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళ లపై ఇన్ని అఘాయిత్యాలు జరుగు తుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరుఏమైందని విమర్శించారు. నగర అధ్యక్షుడు బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సమన్వయకర్తలు అంబటి మురళి (పొన్నూరు), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), ఎలికా శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎంపీ అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి, రజని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

నూతన భవన సముదాయానికి రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షలను నగరానికి చెందిన పర్వతనేని వెంకట లక్ష్మీ, పర్వతనేని నాగ మోహన సాయి విరాళంగా ప్రకటించారు.


సామినేని, చుక్కపల్లి రమేష్‌లకు చెక్కును అందజేస్తున్న దాతలు

శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు వారు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాల కవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, వాసిరెడ్డి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేట మార్గంలో ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

చిలకలూరిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట - చిలకలూరిపేట మార్గంలో మండలంలోని కోమటినేనివారిపాలెం వద్ద బస్‌స్టాప్ సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా ప్రమాద హెచ్చరిక బోర్డులను శనివారం ఏర్పాటు చేశారు. వాహనాలను వేగంగా నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మాలధారణ స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో దీక్ష స్వాములు

వినుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాలాధారణ చేసిన స్వాములకు పట్టణంలోని పాత శివాలయం, మార్కాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం, తిమ్మాయిపాలెం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం మధ్యాహ్న కార్తీక మాసం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1200 మంది అయ్యప్ప, భవాని, శివ మాల వేసుకున్నారు. ప్రతి రోజు దేవాలయాల్లో అన్నదానం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

యర్రం నాయుడుకి ఘన నివాళి

నరసరావుపేట టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి కింజరపు యర్రం నాయుడు వర్ధంతి నిర్వహించారు. యర్రంనాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ మహోన్నత నేత, సిక్కోలు సింహం సామాన్య ప్రజల శ్రేయస్సుకు ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఆయన కుటుంబం మొత్తం టీడీపీలో ఉంటూ చంద్రబాబునాయుడు సారధ్యంలో ప్రజలకు ఎన్నో సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట గొడవ

● రాస్తారోకో చేసిన ముస్లింలు

చిలకలూరిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల 11 నెలల పాప చనిపోయిందని పట్టణంలోని రహమత్ నగర్ చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం కుటుంబసభ్యులు, ముస్లిం పెద్దలు ఆస్పత్రి డాక్టర్లతో చర్చలు జరిపారు. అనంతరం వారు ఆందోళనను విరమించారు.

ప్రభుత్వ వైద్యశాలలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

నూజెండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ వైద్యశాలను డీఎం అండ్ హెచ్‌వో బీ.రవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని వసతులు, ఫార్మసీ, ల్యాబ్ నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, ప్రహరీలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ వైద్యశాలలో రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, రోజువారి ఓపీ పెరిగే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. వాక్సినేషన్, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్పేంద్ర కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెల వ్యవధిలో అర్జీల పరిష్కారం

● తహసీల్దార్ విజయశ్రీ

యడ్లపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలను నెల రోజుల వ్యవధిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. యడ్లపాడులో రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే అనంతరం ఏర్పడిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోందన్నారు. భూయజమానులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 23 అర్జీలు రాగా వాటిలో 15 భూ విస్తీర్ణంలో వ్యత్యాసంకు సంబంధించినవి కాగా మ్యుటేషన్, సర్వేకు సంబంధించి 8అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్ర, ఆర్ఐ జయరాజు, వీఆర్వో రఫీ, విలేజ్ సర్వేయర్లు యూన్సీ, ఖాజా, రైతులు పాల్గొన్నారు.

వయోజనుల్లో అక్షర జ్ఞానం పెంపొందించాలి


యడ్లపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనులందరికీ శిక్షణ ఇచ్చి వారిలో అక్షర జ్ఞానాన్ని పెంపొందించాలని ఎంపీడీవో హేమలతాదేవి అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉల్లాస్(అక్షర వెలుగు) వయోజన విద్య కార్యక్రమంలో భాగం గా వయోజనులకు చదువు నేర్పించే విద్యావలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్ష ణ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీడీవో మాట్లాడుతూ మహిళా సాధికారతకు తొలి మెట్టు అక్షర జ్ఞానం అన్నారు. ప్రతి మహిళ చదువుకో వడం ద్వారా తమ హక్కులు, బాధ్యతల గురించి అవగాహన ఏర్పడుతుందన్నారు. జిల్లా హెచ్‌డీ కో-ఆర్డినేటర్ ప్రియదర్శిని మాట్లాడుతూ మండలం లోని 18 గ్రామాల పరిధిలో 15 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 440 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారన్నారు. వీరందరికీ వయోజన విద్య ద్వారా అక్షర జ్ఞానం కలిగించాలన్నదే అక్షర వెలుగు కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవీంద్ర కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీసీలు, వివిధ గ్రామాలకు చెందిన వీవోఏలు పాల్గొన్నారు.

వరి సాగు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న తెగుళ్లు

వినుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం పండించిన పంటలు చేతికి అందకముందే, ఆ పంటలకు పురుగులు, తెగుళ్లు సోకడంతో రైతులకు తీరని సోకం మిగిల్చింది. దుక్కి, దున్ని, నాటు వేసి, తీరా వరికి పాల కంకి విడిచే సమయంలో ఆకు మచ్చ పురుగు చేరి వరి దుబ్బుని తినేస్తుంది. దీంతో రైతులు వేలకి, వేలు ఖర్చు చేసి తగిన క్రిమి సంహారక మందులను పిచికారి చేసినా ఆశించిన మేరకు తెగుళ్ల నివారణకు పరిష్కారం లభించకపోవడంతో రైతుల కంటికి నిద్రపట్టని పరిస్థితి నెలకొని ఉంది. రైతులు నాట్లు వేసినది మొదలుకొని, పంట కోతకోసే వరకు నీలి మందులు పిచికారి చేయలేక ఆర్థికంగా నష్టాలు చవి చూస్తున్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఖరీఫ్ ప్రారంభం నుంచి ఈపూరు, శావల్యాపురం మండలాల్లో 8వేల హెక్టార్లకు పైగా వరి పంటను సాగర్ కాలువపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వినుకొండ, బొల్లాపల్లి, నూజెండ్ల తదితర ప్రాంతాల్లో చెరువులు, బావులు, లిఫ్టులపై సుమారుగా మరో నాలుగు వేల హెక్టార్లు మేరకు రైతులు వరి పంటలు పండిస్తున్నారు. రైతులు తిండి గింజల కోసం బీపీటీ, ఎన్ఎల్ఆర్, 1000-16, 1000-10, జిలకర సన్నాలు తదితర పంటలు పండిస్తున్నారు. దోమకాటుకి, కాడపురుగు తెగుళ్లను తట్టుకునే పంటలను సాగు చేస్తున్నారు. ఎరువుల డీలర్లు అధిక లాభాల కోసం నాసిరకం క్రిమిసంహారక మందులను నిరక్షరాస్యులైన రైతులకు అంటకంటి సొమ్ము



కాడపురుగు సోకి ఎండు ముఖం పట్టిన వరి పైరు



పైరుకు సోకిన కాడపురుగు

చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరి పంటలు పొట్ట దశలో తెగుళ్ల నివారణకు ఏ మందులు వాడాలో తెలియక ఆర్థికంగా నష్టాలు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని జాలపాలెం గ్రామానికి చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు అనే రైతు తిండి గింజల కోసమని వరి పంటలను సాగు చేస్తున్నారు. ఆగస్టులో నాట్లు వేసి తీర పంట పొట్ట దశకు వచ్చే సమయంలో పంటలకు కాడపురుగు సోకి ఆకు చివరి భాగం ఎండిపోయింది. ఇటీవల షాపు యజమాని చెప్పిన విధంగా పలు రకాల మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదని, మళ్లీ బలానికి రూ.వెయ్యి వెచ్చించి సూర, మరో వెయ్యి రూపాయలు వెచ్చించి రెండు రకాల మందులు చల్లు తున్నానని ఆవేదన



తెగులు సోకిన పొలాన్ని పరిశీలిస్తున్న రైతు

వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు గ్రామ రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయంతో రైతులకు సరైన సమయంలో, సరైన మందులు పిచికారి చేసే విధంగా చైతన్యపరిచి, రైతులకు ఆర్థిక నష్టాన్ని తగ్గించి, పంటలకు అధిక దిగుబడి సాధించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎవరైనా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేద్దామంటే అభివృద్ధి వద్దని చెప్పటమే

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేటఅర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక వేళ ఇంకా ఎవరైనా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేద్దామంటే మాకు అభివృద్ధి వద్దని చెప్పటమే అవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఐదు సంవత్సరాల్లో రోడ్ల నిర్మాణానికి గాని, మరమ్మతులకు గానీ ఏ గ్రామానికి నిధులు ఇవ్వలేదని, ఐనా ఇంకా ఎవరైనా ఆ పార్టీకి ఓట్లు వేసే వారు ఉంటే సిగ్గుపడాల్సిందేనన్నారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడులో రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. రూ.35 లక్షలతో ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు ప్రారంభించారు. 7.5 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గత ఐదు సంవత్సరాలు జగన్ ఎలాంటి పాలన అందించారో చూసిన తరువాత కూడా ఫ్యాన్‌కు ఓటు వేస్తున్నారంటే ఇంక రహదారులు, మంచి నీరు సహా వారికి ఏవీ అవసరం లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పది నుంచి 15 సంవత్సరాలు ఉంటే గ్రామాలన్నీ సస్యశ్యామలమయ్యే అవకాశం



గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పొత్తులో ఉన్నాం కాబట్టి కేంద్రం ఆదుకోబట్టి నిధులు వస్తున్నాయన్నారు. సూపర్- 6 హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయటానికి సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఏటా రూ.2,684 కోట్లతో దీపం - 2 పథకం

రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల మేలు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఏటా రూ.2,684 కోట్లతో దీపం - 2 పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే పుల్లారావు అన్నారు. జగన్‌రెడ్డి చేసిన అప్పులు రూ.14 లక్షల కోట్లకు ఏడాదికి వడ్డీలు, వాయిదాలే రూ.70 నుంచి 80వేల కోట్లు అవుతున్న పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు లేకపోతే ఈ రాష్ట్రం అధోగతి పాలయ్యేదని తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం దీపం - 2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. నియోజకవర్గంలో 61,967 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. నవంబరు నుంచి మార్చి నెల వరకు ఎప్పుడు బుక్ చేసుకున్నా 48 గంటల్లో వినియోగదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. దీపం పథకానికి సీఎం చంద్రబాబు భారీగా ఖర్చు పెడుతున్నారని, ఏటా రాష్ట్ర వ్యాప్తంగా 2,684 కోట్లు ఒక్క పల్నాడు జిల్లాకే ఏడాదికి రూ.163 కోట్లు ఖర్చవుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు ప్రారంభం

నరసరావుపేట టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణంలో, గ్రామాల్లో పర్యటించారు. పట్టణంలో పలు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువల మరమ్మతుల పనులను, అదేవిధంగా మండలంలోని పెట్లూరి వారిపాలెం, కొటప్పకొండ వెళ్లే రోడ్ మరమ్మతుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అడుగుకో గుంత, రోడ్లు అధ్వానంగా మారితే తట్టడు మట్టి కూడా వేసిన పాపాన పోలేదన్నారు. ఈ గుంతల వల్ల రాష్ట్రంలో చాలా మంది ప్రాణాలను కోల్పోయారన్నారు. ప్రజలపై చెత్త పన్ను భారం వేసి చెత్త పన్నులను వసూల్ చేయడమే కానీ ఎక్కడ చెత్త తీసిన దాఖలాలు లేవన్నారు. పట్టణం, గ్రామాలు సుందరంగా తీర్చి దిద్దడంలో అధికారులు



రోడ్ల మరమ్మతుల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పాత్ర చాలా కీలకమని, మీకు ఏసమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చే దిశలో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణపరిధిలో మున్సిపల్ కమిషనర్ ఎం జస్వంత్‌రావు, ఆర్అండ్‌బీ అధికారులు, టీడీపీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కేసులు

● పట్టణ సీఐ శోభన్‌బాబు

వినుకొండటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డు, నరసరావుపేట రోడ్డు, పల్నాడు రోడ్డుపై వ్యాపారులకు, చిరువ్యాపారులకు శనివారం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ప్రధానంగా తోపుడు బండ్లు రోడ్డు మార్జిన్ వెలుపల నిలపాలని, రోడ్డుపైకి వచ్చిన తోపుడు బండ్లు స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. వాహనాలను పార్కింగ్ స్థలంలోనే నిలపాలని, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారులు వ్యాపార సంబంధిత బోర్డులు రోడ్డుపై తొలగించాలని లేనిపక్షంలో మున్సిపల్ అధికారులతో కలిసి కేసులు నమోదు చేస్తామన్నారు.

మండల ఏవోగా వీరయ్య

బొల్లాపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బొల్లాపల్లి మండల పరిపాలన అధికారిగా డీ.వీరయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో దుగ్గిరాల మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై బొల్లాపల్లి మండలంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వీరయ్యను కార్యాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ప్రభాకరరావు

బొల్లాపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బొల్లాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఏ ప్రభాకరరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో జిలానీ బాషా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో కలెక్టర్ అరుణ్‌బాబు సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఈపూరులో ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.ప్రభాకర్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమించారు.

కోటప్పకొండలో కార్తీక పూజలు

● త్రికోటేశ్వర స్వామికి రుద్రాభిషేకం

నరసరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక అభిషేకాలు.. విశేష పూజలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో త్రికోటేశ్వర స్వా మికి అభిషేకం చేయటం వల్ల సర్వదోష నివారణ, సర్వ కార్య సిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. త్రికోటేశ్వర స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో డీ చంద్ర శేఖరరావు పర్యవేక్షించారు. నరసరావుపేట, చిలకలూరి పేట డిపోల నుంచి ఆర్టీసి బస్సులను కొండకు నిర్వహించనున్నారు. పోలీసు శాఖ భద్రతా చర్యలు చేపట్టింది.



కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకారం

శివాలయాల్లో వైభవంగా అభిషేకాలు

నరసరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాల యాల్లో కార్తీకమాస వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకం చేశారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళీశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయం, బాలయ్యనగర్ శివాలయంలో అభిషేకాలు చేశారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో

నరసరావుపేట అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శివలింగాకారంలో మట్టితో ఏర్పాటు చేసి అభిషేకాలను నిర్వహించారు.

రొంపిచర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్లలోని శంకర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వర స్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, గోగుల పాడు, సంతగుడిపాడులోని వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై కేసు నమోదు చేయాలి

వినుకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ నన్నపనేని వెంకట్రావు చౌదరి అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారని జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశ్శంకరరావు శ్రీనివాసరావు వీరమహిళలు, కార్యకర్తలతో కలిసి ఆయనపై వినుకొండ పట్టణ సీఐ శోభన్ బాబుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా నిశ్శంకరరావు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల్లో పవన్ కల్యాణ్‌పై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టినా నాడు పట్టించుకోలేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్‌కల్యాణ్‌పై మరోసారి అభ్యంతరకర పదజాలంతో పోస్టులు పెట్టారని, పోస్టులు పెట్టిన వారిపై కేసులు



సీఐ శోభన్‌బాబుకి ఫిర్యాదు చేస్తున్న జనసేన నేత నిశ్శంకరరావు శ్రీనివాసరావు, వీరమహిళలు, జనసైనికులు

నమోదు చేయాలని పోలీసులను ఆయన డిమాండ్ చేశారు. కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని కృష్ణవేణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు శనివారం జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. హైద్రాబాద్ శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఎండీ ఎస్‌వీ రమణారావు భవిష్యత్తులో మేనేజిమెంట్ కోర్సులపై అవగాహన కల్పించారు. నైపుణ్యాన్ని ఎలా మెరుగుపరుచుకోవాలో తెలియజేశారు. ప్రొఫెసర్ సుభాష్ తేజ్ డేటా సైన్స్ ప్రాముఖ్యాన్ని ఏఏ సెక్టార్లలో ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌కే సతీష్‌బాబు, ఎస్‌కే సర్దార్, అధ్యాపకులు, ఆధ్యాత్మిక సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శివశివాని ఎండీ రమణారావు, ప్రిన్సిపాల్ తదితరులు

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి : ఎంపీపీ

నూజెండ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు.



కొండ్రముట్ల వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతు పనులు చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులను ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామం వద్ద గుంతలు పూడ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఆంజనేయులు మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి చిరునామా కాగా ఎన్డీయే ప్రభుత్వంలో అభివృద్ధే ధ్యేయంగా ముందుకు దూసుకెళ్తోందన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.826 కోట్లు రాష్ట్రం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా దఫాలు వారీగా చెల్లిస్తున్నామన్నారు. సొంత భూములు ప్రభుత్వ కాలనీలకు అమ్మి ప్రభుత్వ డబ్బులు తీసుకోవడం, జాతీయ రహదారుల పక్కన భూములు కొనుగోలు చేయడం మాజీ ఎమ్మెల్యే బొల్లాకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, నర్రా కిశోర్, బైలడుగు రామయ్య, ఐనాల కోటేశ్వరరావు, తిరుమలశెట్టి బాలయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, గోపు వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాట్లో ఎరువులు, పురుగు మందులు



● ఏడీఏ రవిబాబు

వినుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, పురుగు మందుల ఇబ్బంది లేకుండా చూస్తామని ఏడీఏ రవి బాబు అన్నారు.



ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయా?

ఏడీఏ : ప్రాథమిక వ్యవసాయ సహాయక కేంద్రాల ద్వారా అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఎరువులను వాడుకుని పంటలకు పోషకాలు అందజేయాలి.

ప్రకృతి వ్యవసాయానికి ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా?

ఏడీఏ : నియోజకవర్గంలో 30 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్నారు. ఏపీసీఎన్ఎఫ్ డిపార్టుమెంటు ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నారు.

పంట నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం రావాలంటే ఏం చేయాలి?

ఏడీఏ : పంట నష్టం 33 శాతం కన్నా ఎక్కువగా జరిగినప్పుడు రైతులు సంబంధిత వ్యవసాయ సహాయకులతో, వ్యవసాయ అధికారులను సంప్రదించి జరిగిన పంట నష్టాన్ని నమోదు చేసుకుని, నష్టపరిహారం పొందవచ్చు.

వరి సాగు పూర్తయిన తర్వాత మళ్లీ ఏ పంటలు వేసుకోవాలి?

ఏడీఏ : వరిసాగు పూర్తయిన తర్వాత నీటి వసతి ఉన్న పంట పొలాల్లో మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. నీటి వసతి లేని పంట పొలాల్లో నువ్వులు, పెసర పంటలు సాగు చేసుకోవచ్చు.

ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి లోకేశ్ కృషి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పర్య టన పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ స్వర్గధామంగా మారిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంసక విధానాల కారణంగా దారి తప్పిన పారిశ్రామిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి పెట్టుబడిదారుల్లో నూతనోత్సాహం నింపుతుందన్నారు. గతనెల 25వ తేదీన అమెరికా పర్యటనకు మంత్రి నారా లోకేశ్ వారం రోజుల పాటు వంద మందికి పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారన్నారు. విజనరీ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వాన రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేస్తున్న ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ విధానాలను వివరించి, రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టాల్సిందిగా ఆహ్వానించారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విధ్వంసమే ఎజెండాగా సాగిందన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల స్థానంలో కమీషన్లు కోసం వేధించారన్నారు. పరిశ్రమదారుల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించి భరోసా కల్పించడం ద్వారా తిరిగి రాష్ట్రానికి రప్పించే గురుతర బాధ్యతను మంత్రి నారా లోకేశ్ తలపెట్టారన్నారు. రానున్న రోజుల్లో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు.

యోగా స్నానం చాలా శ్రేష్ఠమైనది


● ప్రధాన యోగాచార్యులు ఆతుకూరి వెంకటేశ్వర గురూజీ



యోగా అభ్యసకులకు జ్ఞాపికలు అందజేస్తున్న నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యోగా స్నానం చాలా శ్రేష్ఠమైనదని ప్రధాన యోగాచార్యులు ఆతుకూరి వెంకటేశ్వర గురూజీ అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణం పట్టాభిరామస్వామి ఆలయంలోని వెంకటేశ్వర కల్యా ణ మండపంలో వెంకటేశ్వర యోగా సేవాకేంద్రం నరసరావు పేట శాఖ నిర్వహించిన 180వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆనంద మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన యోగాచార్యులు ఆతుకూరి వెంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి యోగాసనాలు, ప్రాణాయామం అభ్యసన చేసి శరీరం మీద పట్టినటువంటి శ్వేదజలాన్ని చక్కగా శరీరం మీద మర్దన చేయడమే యోగా స్నానం అన్నారు. జీవితం, ప్రకృతి, శరీర, దైవత్వాన్ని అర్థం చేసుకుంటే మాత్రమే మనస్సుశాంతి లభిస్తుందన్నారు. 180వ శిబిరంలో 28 రోజుల పాటు శిక్షణకు హాజరైన అభ్యసకులకు నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దన్ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సహాయ గురువులు అడ్డగిరి రమేష్, పొలిమేర వెంకటరెడ్డి, లక్ష్మీ, మల్లేశ్వరి, అభ్యసకులు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



కాలనీలో ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపుతున్న సీపీఐ నాయకులు

వినుకొండటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని వయ్యకంటి శివప్రసాద్ కాలనీలో ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. సమస్యలపై శనివారం కాలనీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా దళిత కాలనీల్లో మార్పు రావడంలేదని, కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడిచినా నేటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, అంటు వ్యాధులు ప్రబలక ముందే కాలనీ వాసులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేవూరి నాగరాజు, కొప్పరపు మల్లికార్జునరావు, ఆదయ్య, సుజాత, లక్ష్మీ, పేరమ్మ, నాగరాణి, దేవి పాల్గొన్నారు.